

RNI.NO. APTEL/26/A2902

గ్లోబల్ వార్త
తెలుగు దినపత్రిక

గ్లోబల్ వార్త
తెలుగు దినపత్రిక

"అతికొద్ది కాలంలోనే అత్యధిక ప్రజాదరణ పొందిన"
"గ్లోబల్ వార్త" జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
అన్నమయ్య జిల్లాలోని నియోజకవర్గాల్లో
రాయచోటి,
రాజంపేట, రైల్వేకోడూరు,
మదనపల్లి, పీలేరు,
తంబళ్ళపల్లి, పుంగనూరు
విలేకరులు కావలెను
వివరాలకు కింద ఉన్న ఫోన్ నెంబర్‌ను సంప్రదించండి.
ఫోన్ నెంబర్స్ - 7093627232, 9392480345, 08562-461571
MAIL ID : globalvarthaindia@gmail.com

సంపుటి 1 | సంచిక 57 | 28-10-2026 | బుధవారం | పేజీలు -4 | వెల-రూ. 5



గ్లోబల్ వార్త - అమరావతి

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. జనజీవన స్రవంతిలోకి రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు నిచ్చారు. 'జనజీవన స్రవంతిలోకి రమ్మని గతంలో నక్సలైట్లకు చెప్పాను. వచ్చినవాళ్లు బాగుపడ్డారు. రాని వాళ్లు ఏమయ్యారో మీకు తెలుసు కదా' అని వ్యాఖ్యానించారు. జగన్ కూడా ఇలానే జనజీవన స్రవంతిలోకి రావాలన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ సహనాన్ని, సంయమనాన్ని కూడా గొడ్డలి పార్టీ దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డారు. వాళ్ల కుటుంబంలోనూ సంక్షోభాన్ని సృష్టించుకున్నారని విమర్శించారు. ఆస్తుల కోసం సొంత చెల్లెళ్లి, తల్లిని మోసం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. 'జగన్ ఆలోచన ప్యాలస్ కోసం.. మా ఆలోచన, తపన.. ప్రజలు. పేదల కోసం' అని చెప్పుకొచ్చారు. నేరాలు, ఘోరాలు చేసే పార్టీ సృష్టించే అడ్డంకులను సమర్థంగా దాటుకుని ముందుకెళ్తామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కూడా చేయనంత కసరత్తు ఈ స్థానిక ఎన్నికల్లో చేశామని సీఎం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో పొత్తులపై గతంలో వివిధ సందర్భాల్లో కసరత్తు చేశామని... కానీ ఈసారి స్థానిక ఎన్నికల్లో చాలా కసరత్తే చేశామని వెల్లడించారు. ఎంపీటీసీల స్థాయిలో సీట్ల సర్దుబాటు.. అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించామన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం కూటమిగా పని చేయడానికి ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. కేంద్రం, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారుగా ముందుకెళుతున్నామన్నారు. ఇక స్థానిక సంస్థల్లోనూ కూటమి గెలుపు ద్వారా ట్రిపుల్ ఇంజిన్ స్పీడ్‌తో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి మద్దతు పలికి ట్రెండ్ సెట్ చేయాలని ప్రజలను కోరారు. ప్రస్తుతం స్థానిక సంస్థ ల్లో సీట్లు ఇవ్వలేని వాళ్లకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్య ర్థులను గెలిపించేందుకు మూడు పార్టీల కార్యకర్తలు, నేతలు కృషి చేయాలని చంద్ర బాబు పిలుపునిచ్చారు.

'మీరు 2.0 చూపిస్తే..



జగన్‌కు పవన్ కల్యాణ్ స్ట్రాంగ్ కౌంటర్

గ్లోబల్ వార్త - అమరావతి : వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సెటైర్ విసిరారు. ఈరోజు (మంగళవారం) ఎన్డీఏ మీడియా సమావేశంలో పవన్ మాట్లాడుతూ.. 'మీరు 2.0 చూపిస్తే మేం 10× చూపిస్తాం. మీరు ఇలా మాట్లాడితేనే 2019లో ప్రజలు గుణపాఠం చెప్పారు' అంటూ వ్యాఖ్యానించారు. జగన్ బెదిరిస్తే బెదిరిపోవడానికి ఇక్కడ ఎవరూ సిద్ధంగా లేరన్నారు. బలహీనులే ఇలా మాట్లాడుతారని.. బలవంతులు ఎవరూ కూడా ఇలా మాట్లాడరని అన్నారు. సీఎం చంద్రబాబు చెప్పినట్టు జగన్ జనజీవన స్రవంతికి రావాలని పిలుపునిచ్చారు. అప్పుడే ఆయనకు ప్రజల మనోభావాలు అర్థమవుతాయని హితవుపలికారు. రాష్ట్రాభివృద్ధి కోసం కూటమిగానే ఉంటామని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో సవాళ్లు వేరే విధంగా ఉంటాయని... స్థానిక సంస్థల ఎన్నికల్లో సవాళ్లు వేరే విధంగా ఉంటాయని చెప్పుకొచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు కొన్ని స్థానాలకు మాత్రమే ఉంటుందని తెలిపారు. ఇప్పుడు సీట్ల సర్దుబాటు ఎక్కువ స్థానాలకు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. క్లిష్టతరమైనా సరే... రాష్ట్రాభి వృద్ధి కోసం కూటమిగానే ఉంటామని స్పష్టం చేశారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో అభివృద్ధికి సంబంధించిన అంశాలు తమ ముందు న్నాయన్నారు. ఈసారి స్థానిక సంస్థల్లో పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలయ్యాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.



ఏపీ పాలిటిక్స్‌లో మరో సంచలనం

భారతి సిమెంట్స్‌కు మైనింగ్ లీజుల వ్యవహారంలో అక్రమ లబ్ధి చేకూర్చారనే ఆరోపణలు

గ్లోబల్ వార్త- అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటు చేసు కుంది. సీనియర్ ఐఏఎస్ అధికారి కృపానందం విచారణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు వచ్చిన సమాచారం చర్చనీయాంశంగా మారింది.గత ప్రభుత్వ హయాంలో పరి శ్రమలు, వాణిజ్యం, గనుల శాఖ కార్యదర్శిగా పనిచేసిన ఆయనకు సంబంధించిన వ్యవహారం ఇప్పుడు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నమోదు చేసిన ఈసీఐఆర్ కేసుకు సంబంధించి ఈ విచారణకు అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోంది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో పాటు మరికొందరితో కుమ్మక్కై అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్నది

తరువాయి 2లో


ఆర్నబ్ తుఫాన్ ప్రభావం
ఏపీ ప్రభుత్వం సర్వత్రా అప్రమత్తం

గ్లోబల్ వార్త - అమరావతి :

అర్నబ్ తుఫాన్‌పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సర్వతా అప్రమత్తమైంది. తుఫాన్ నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, ఆర్టీజీ శాఖ మంత్రి నారా లోకేశ్, హోం మంత్రి అనిత నిరంతరం సమీక్షిస్తున్నారు. ప్రస్తుతం విశాఖ పట్నానికి 215 కిలోమీటర్ల దూరంలో తుఫాన్ కేంద్రీకృతమైందని ఏపీ ప్రభుత్వం తెలిపింది. బుధవారం ఉదయం యానం వద్ద తీరం దాటే సూచనలు ఉన్నాయని పేర్కొంది. తీరం వెంబడి సము ద్రపు కెరటాలు ఎగసిపడుతున్నాయని వెల్లడించింది. సముద్రపు అలలు 1 నుంచి 2 మీటర్ల ఎత్తు వరకు ఎగసి పడే అవకాశం ఉందని పేర్కొంది.

ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం

'ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. 14 జిల్లాలకు 12 ఎన్డీఆర్ ఎఫ్, 10ఎస్డీఆర్ ఎఫ్ దళాలను సహాయ చర్యల కోసం అధికారులు తరలించారు. 20 జిల్లాల్లో 2,131 తుఫాన్ షెల్టర్ ప్రాంతాలను ఏర్పాటు చేశాం. 18 జిల్లాల్లో 2.70 కోట్ల మంది మొబైల్స్‌కు నిరంతరం తుఫాన్ హెచ్చరికలు జారీ చేశాం. సముద్ర తీర ప్రాంతాల్లో 30,043 ఫిషింగ్ బోట్లు నిలిచిపోయాయి. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో 1,087 వైద్య బృందాలను ఏర్పాటు చేశాం. 8,281 అత్యవసర పడకలు, 1,274 అంబులెన్సులను అధికారులు సిద్ధం చేశారు. పాముకాటు బారి నుంచి రక్షించేలా ఆస్పత్రుల్లో 21,536 యాంటీ స్నేక్ వీనమ్‌లు సిద్ధంగా ఉన్నాయి. 1,351 మంది గర్భిణులను ఇప్పటికే ఆస్పత్రులకు సురక్షితంగా తరలించాం. 2,613 మంచినీళ్ల ట్యాంకర్లు, 2,430 జనరేటర్లు, 4,448 ఆర్వో ప్లాంట్లు సిద్ధం చేశాం. 14,686 రేషన్ దుకాణాల్లో రెండు నెలలకు సరిపడా నిత్యావసరాలను ముందస్తుగానే నిల్వ చేశాం. పంటలకు నష్టం వాటిల్లకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని 35.96 లక్షల మంది రైతులకు సూచనలు జారీ చేశాం. ప్రభుత్వ వసతి గృహాలపై నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. 419 గిరిజన హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి సారించాం. హాస్టళ్లలో ఉంటున్న 88,083 మంది విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేశారు. 550 జేసీబీలు, 596 ఎలక్ట్రిక్ రంపాలను రోడ్లు, భవనాల శాఖ సిద్ధం చేసింది. 1,079 జలాశయాల వద్ద పరిస్థితిని నిరంతరం అధికారులు సమీక్షిస్తున్నారు. ఆర్టీజీఎస్ నుంచి జిల్లాల్లో



పరిస్థితిని 24/7 అధికారులు పర్యవేక్షిస్తున్నారు. జిల్లాల్లో చేపట్టిన తుఫాన్ ముందస్తు సన్నద్ధత ఏర్పాట్లను ఆర్టీజీ కార్యదర్శి భాస్కర్ కాటంనేని, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్‌లు నిరంతరం సమీక్షిస్తు న్నారు. తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో ఎప్పటికప్పుడు పరిస్థితిని జిల్లాల యంత్రాంగానికి ఆర్టీజీఎస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు చేరవేస్తున్నారు' అని ఏపీ ప్రభుత్వం పేర్కొంది.

ఆర్నబ్ తుపాన్‌ను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం
జీవీఎంసీ కమిషనర్

గ్లోబల్ వార్త - విశాఖపట్నం

ఆర్నబ్ తుపాన్‌ను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) కమిషనర్ కేతన్ గార్గ్ స్పష్టం చేశారు. మంగళవారం భారీ వర్షాల నేపథ్యంలో విశాఖపట్నంలోని నార్త్, వెస్ట్ జోన్లలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఏబీఎన్‌తో మాట్లా డుతూ.. క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల్ని అప్రమత్తం చేశామని అన్నారు. కోండ వాలు, లోతట్టు ప్రాంతాల ప్రజల భద్రతకు తక్షణమే చర్యలు చేపట్టామని



పేర్కొన్నారు. పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రమాదకర ప్రాంతాల్లోని ప్రజలు సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని సూచించారు. ఆర్నబ్ తుపాన్ నేపథ్యంలో వర్షాలు, ఈదురు గాలులతో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఆయన స్పష్టం చేశారు. అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని ప్రజలను కోరారు. చెట్లు కూలడం, కాలువలు పొంగి పొర్లడం, విద్యుత్ స్తంభాలు, హోర్డిం గులు కూలే ప్రమాదం ఉందని అన్నారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు స్పష్టం చేశారు. టోల్ ఫ్రీ నంబర్ 1800 4250 0009, వాట్సాప్ 90142 18870 నంబర్ అందుబాటులోకి తీసుకొచ్చా మని పేర్కొన్నారు. అత్యవసర మైతే..ఈ నంబర్లకు కాల్ చేయాలని ప్రజలను జీవీఎంసీ కమిషనర్ కోరారు.

దెబ్బతిన్న విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండాలని... ప్రమాదాన్ని తేలికగా తీసుకోవద్దని హెచ్చ రించారు. అత్యవసర వస్తువులను సిద్ధంగా ఉంచుకోవా లన్నారు. తాగునీరు, మందులు, అవసరమైన నిత్యావసరాలు, ముఖ్యమైన పత్రాలను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. రైతులు, పశువుల యజమానులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని.. పంటలు, పశువులు, వ్యవసాయ పరికరాల రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.పుకార్లను నమ్మవద్దని.. వ్యాప్తి చేయవద్దని కలెక్టర్ తెలిపారు. అధికారిక ప్రకటనలు, వాతావరణ హెచ్చరికలను మాత్రమే విశ్వసించాలని కోరారు. 'అత్యవసరం కాని ప్రయాణాలను నివా రించండి... మీ భద్రతతో పాటు కుటుంబ సభ్యుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వండి. మీ అప్రమత్తతే మీ కుటుంబానికి రక్షణ. అధికారుల సూచనలను నిర్లక్ష్యం చేయవద్దు. అత్యవసర పరిస్థితుల్లో సహకరించండి. ప్రాణాలను కాపాడుకోండి, ఇతరుల ప్రాణాలనూ కాపాడండి' అంటూ కలెక్టర్ వినతి చేశారు.

విశాఖలో తుఫాన్ ముప్పు.. ప్రజలకు కలెక్టర్ అత్యవసర విజ్ఞప్తి

గ్లోబల్ వార్త - విశాఖపట్నం

విశాఖలో తుఫాన్ ముప్పును దృష్టిలో ఉంచుకుని ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టిం ది. ఈ సందర్భంగా ప్రజలకు జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ అత్యవసర విజ్ఞప్తి చేశారు. ప్రజలందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి, ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలన్నారు. అధికారులు ఇచ్చే సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని... వాతావరణ పరిస్థితులు అనుకూలించే వరకు సముద్ర ప్రయాణాలకు దూరంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాలు, తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని... అధికారులు తరలింపు ఆదేశాలు జారీ చేస్తే వెంటనే సహకరించాలని తెలిపారు. వరదనీటితో నిండిన



రహదారులు, వాగులు, పొంగిపొర్లే డ్రైనేజీలను దాటే ప్రయత్నం చేయవద్దని కలెక్టర్ సూచించారు. తెగిపడిన విద్యుత్ తీగలు,

మలబార్ గోల్డ్ పై ఎఫ్ఐఆర్ నమోదు
నమ్మకం పేరిట నిలువు దోపిడీ!



బిలాస్‌పూర్‌లోని మలబార్ గోల్డ్ షోరూమ్‌కి ఒక కస్టమర్ వెళ్లాడు. అతని కోరిక చాలా సింపుల్: తన దగ్గరున్న పాత 22 క్యారెట్ల హెచ్‌యుఐడి హాల్‌మార్క్ ఉన్న బ్రాస్‌లెట్‌ని ఎక్స్ఛేంజ్ చేసుకోవడం. షోరూమ్ సిబ్బంది దాన్ని తమ ఎక్స్ఆర్ఎఫ్ ప్యూరిటీ టెస్టింగ్ మెషీన్‌లో పరీక్షించారు. ఒక్కసారి కాదు... రెండుసార్లు... ఏకంగా మూడుసార్లు టెస్ట్ చేశారు. ప్రతీసారీ రీడింగ్ ఒకేలా వచ్చింది: కేవలం 20 క్యారెట్ మాత్రమే! పైగా ఆ బ్రాస్‌లెట్‌పై అసలు హాల్‌మార్క్ లేదని బుకాయిం చారు. వెంటనే ఆ కస్టమర్ ఆ బ్రాస్‌లెట్ అమ్మిన లోకల్ జ్యువెలర్‌కి ఫోన్ చేసి రప్పించాడు. ఆ జ్యువెలర్ స్వయంగా వచ్చి హెచ్‌యుఐడి నెంబర్‌ని నిర్ధారించి, వాళ్ల ముందే మళ్లీ టెస్ట్ చేయాలని పట్టుబట్టాడు.

అదే మెషీన్... అదే బ్రాస్‌లెట్... అదే రూమ్!

ఈసారి అక్కడి ఉద్యోగి మెషీన్‌లో ఏదో 'సెట్టింగ్' మార్చాడు. అంతే! కట్ చేస్తే రీడింగ్ ఒక్కసారిగా 916 -ప్యూర్ 22 క్యారెట్ గా మారిపోయింది! ఆ లోకల్ జ్యువెలర్ ఈ తతంగాన్నంతా వీడియో రికార్డ్ చేశాడు. వెంటనే సరఫా అసోసియేషన్ రంగంలోకి దిగింది. పోలీసులు షోరూమ్ మేనేజర్, మెషీన్ ఆపరేటర్ లపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆ టెస్టింగ్ మెషీన్, సీసీటీవీ డివిఆర్ స్వాధీనం చేసుకున్నారు. ఇదేదో చిన్న వీధి చివరి దుకాణం కాదు... దేశవ్యాప్తంగా 'నమ్మకం, స్వచ్ఛత, బిఐఎస్ ప్రమాణాలు' అంటూ రోజూ ప్రకటనలు గుప్పించే "మలబార్ గోల్డ్"! ఒకే ఒక్క బ్రాస్‌లెట్... రెండు రకాల రీడింగ్‌లు... ఏకంగా 8శాతం బంగారం విలువలో తేడా! ఇక్కడ మారిన ఏకైక విషయం ఏంటంటే, పక్కన నిలబడి ఎవరు చూస్తున్నారు అనేది మాత్రమే! ఒక హాల్‌మార్క్ ఉన్న బంగారు ఆభరణం, కస్టమర్ ఎక్స్ఛేంజ్ చేసుకోగానే అద్భుతంగా రెండు క్యారెట్లు తగ్గి పోయి...

తరువాయి 2లో

ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో
రాజ్ కసిరెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట



గ్లోబల్ వార్త - న్యూఢిల్లీ

ఏపీలో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. కసిరెడ్డి అరెస్ట్ విధానం, ప్రొడక్షన్ వారెంట్‌పై ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టి వేసింది. కసిరెడ్డికి ఏపీ హైకోర్టు మంజూరు చేసిన బెయిల్‌లో జోక్యానికి నిరాకరించింది. విచారణ పూర్తయ్యే వరకు నిందితుడు దేశం విడిచి వెళ్లకూడదని, పోలీసు దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరించాలంటూ సుప్రీంకోర్టు షరతు విధించింది. 'అరెస్టు చేయబోము' అని కోర్టులో హామీ ఇచ్చిన తర్వాత కూడా ప్రొడక్షన్ వారెంట్ జారీ చేయడంపై సుప్రీం కోర్టులో తీవ్ర వాదనలు జరిగాయి. హైకోర్టు తీర్పు లోని కొన్ని వ్యాఖ్యలను అంగీకరించకపోయినా, నిందితుడి బెయిల్, స్వేచ్ఛను రద్దు చేయలేమని అత్యున్నత న్యాయ స్థానం స్పష్టం చేసింది. పోలీసులు నేరుగా చేసే అరెస్ట్‌కు, కోర్టు జారీ చేసే ప్రొడక్షన్ వారెంట్‌కు తేడా ఉందని ధర్మాసనం తెలిపింది. ముందస్తు అనుమతి లేకుండా మళ్లీ అరెస్ట్ చేయకూడదన్న హైకోర్టు తీర్పులోని పేరా-23 నిబంధనలను న్యాయస్థానం సమర్థించింది. నిందితుడు విచారణకు సహకరించకపోతే బెయిల్ రద్దు కోసం కోర్టును ఆశ్రయించేస్వేచ్ఛ రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని సుప్రీం కోర్టు పేర్కొంది.



వృద్ధులకు అన్నదానం

గ్లోబల్ వార్త - లింగాల

లింగాల మండలం ఇప్పట్ల గ్రామ సమీపంలోని లీలావతి వృద్ధాశ్రమంలో మంగళవారం వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చంచల సుబ్బరాయుడు 29వ వర్ధంతిని పురస్కరించుకొని కుమారుడు చంచల సుబ్రహ్మణ్యం, వారి కుటుంబ సభ్యులు వృద్ధులకు మాంసాహారంతో కూడిన ఆహారాన్ని వడ్డించారు. అనంతరము వారికి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ అనాధలకు వృద్ధులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం భగవంతునికి నైవేద్యం పెట్టినట్లేనని, ప్రతి ఒక్కరిలోనూ సేవాభావం అలవర్చుకొని అనాధలకు వృద్ధులకు సేవ సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ నివాహకులు తదితరులు పాల్గొన్నారు

మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్ కు జగన్మోహన్ రెడ్డి పరామర్శ

గ్లోబల్ వార్త - పులివెందుల



పులివెందుల మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్ ని మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ పరామర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల సవరంలో చోటు చేసుకున్న పరిస్థితులను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు పులివెందులలో రెండు రోజుల పర్యటనలో భాగంగా మున్సిపల్ నామినేషన్ల రోజున జరిగిన పోలీసుల కాల్పుల్లో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హఫీజ్‌కి, పార్టీ తరఫున అండగా ఉంటామని, అధైర్యపడవద్దని వైయస్ జగన్మోహన్ రెడ్డి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా హఫీజ్ వైయస్ జగన్మోహన్ రెడ్డితో మాట్లాడుతూ పార్టీ కోసం తన అభిమాన నాయకుడు జగన్మోహన్ రెడ్డి, జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డి కోసం ప్రాణాల సైతం లెక్కచేయకుండా పనిచేస్తామని తెలిపారు.

పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తా

చిన్నకుడల ఎంపీటీసీ స్థానానికి లోమడ స్నేహ ఏకగ్రీవ ఎన్నిక

గ్లోబల్ వార్త - లింగాల



స్థానిక సంస్థ ఎంపీటీసీ ఎన్నికలలో చిన్నకుడల ఎంపీటీసీ స్థానానికి రామన్నాతల పల్లె గ్రామానికి చెందిన లోమడ స్నేహ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేయగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా లోమడ స్నేహ మాట్లాడుతూ, తనకు ఈ అవకాశం కల్పించిన పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి, మారెడ్డి భరత్ రెడ్డి, జోగి రెడ్డి లింగాల మండల టీడీపీ ఇంచార్జ్ దేవిరెడ్డి సంజీవరెడ్డి, విశ్వనాథ్ రెడ్డి మరియు పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని స్నేహ తెలిపారు.



సింహాద్రిపురం మండలంలో ఎంపీటీసీల ఏకగ్రీవం

వివరాలు వెల్లడించిన ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి

గ్లోబల్ వార్త - సింహాద్రిపురం

సింహాద్రిపురం మండల పరిధిలో నిర్వహించిన ఎంపీటీసీ ఎన్నికల్లో 8 స్థానాలను తెలుగుదేశం పార్టీ (టీడీపీ),ఒక స్థానాన్ని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కైవసం చేసుకుని ఏకగ్రీవంగా గెలుపొందినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) శ్రీనివాసరెడ్డి అధికారికంగా వెల్లడించారు. మండలంలో ఏకగ్రీవమైన ఎంపీటీసీ స్థానాలు, గెలుపొందిన అభ్యర్థుల వివరాలను ఆయన విడుదల చేశారు. ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థులు కసనూరు పుష్పాల సుజాతమ్మ (టీడీపీ) కోవరంగుట్టపల్లి నారప్పగారి హరిప్రసాద్ (టీడీపీ) లోమడ ఏరికిరెడ్డి హిమవంతి (టీడీపీ)గురజాల లోమడ నాగజ్యోతి (టీడీపీ) బాలపనూరు కొత్తారెడ్డి రవిచంద్రారెడ్డి (టీడీపీ) సింహాద్రిపురం పెద్దఎల్లప్పగారి జయప్రద (టీడీపీ) బిదినంచెర్ల జుటూరు సుకన్య (టీడీపీ) తెలికి మసగాని రమణ (టీడీపీ) హిమకుంట్ల వంగాల శిరీష (బీజేపీ).మండలంలో మొత్తం 9 ఎంపీటీసీ స్థానాలకు గాను టీడీపీ 8 స్థానాలు,బీజేపీ 1 స్థానంలో విజయం సాధించినట్లు అధికారులు ధ్రువీకరించారు. ఏకగ్రీవం గా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు పార్టీ నాయకులు,స్థానిక ప్రజలు అభినందనలు తెలియజేశారు.

భారతీ సిమెంట్‌కు మైనింగ్ లీజుల....

(మొదటి పేజీ తరువాయి)

ఈ కేసులో ప్రధాన ఆరోపణగా ఉంది. మైనింగ్ లీజుల కేటాయింపు ప్రక్రియలో భారతి సిమెంట్స్‌కు అక్రమంగా ప్రయోజనం చేకూర్చేలా వ్యవహరించారనే ఆరోపణలు కూడా ఈ వ్యవహారంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో సీనియర్ ఐఏఎస్ అధికారి విచారణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు వచ్చిన వార్తలు అధికార, రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన నిర్ణయాలు, వాటి వెనుక ఉన్న అధికారుల పాత్రపై విచారణ జరిగే అవకాశం ఉండటంతో ఈ వ్యవహారం ఎలాంటి మలుపులు తిరుగుతుందన్నది చర్చనీయాంశంగా మారింది.

మల్‌బార్ గోల్డుపై ఎఫ్ఐఆర్ నమోదు


(మొదటి పేజీ తరువాయి)

గట్టిగా నిలదీయగానే మళ్లీ రెండు క్యారెట్లు ఎలా పెరుగుతుంది? అసలు ఆ మెషీన్ దేన్ని టెస్ట్ చేస్తోంది? కస్టమర్లు మలబార్ లాంటి పెద్ద షో రూమ్‌కి వెళ్లేది...బంగారం అమ్మేటప్పుడు మాత్రమే బయటపడే ఇలాంటి 'క్యాలిబ్రేషన్ తప్పుల' కోసం కాదు. తమ బిల్లుపై ముద్రించిన స్వచ్ఛత కోసం!

– ఎఫ్ఐఆర్ నమోదు కావడం నిజం.

– ఆ రెండు రకాల రీడింగులు రికార్డుల్లో ఉండటం నిజం.

– పోలీసులు మెషీన్‌ను సీజ్ చేయడం కూడా నిజం! ఒకే బంగారానికి మళ్లీ 22 క్యారెట్ అని రావడానికి మధ్యలో ఆ 'సెట్టింగ్' ఎందుకు మార్చాల్సి వచ్చిందో మలబార్ ఇప్పటికీ సమాధానం చెప్పలేదు. వాళ్లు క్లారిటీ ఇచ్చేంత వరకు, ఇది కేవలం మెషీన్ లోపం కాదు... ఇదొక తెలివైన దోపిడీ వ్యాపార విధానం!



వేముల మండలంలో టీడీపీకి పూర్వవైభవం!

ఎనిమిదికి ఎనిమిది ఎంపీటీసీ స్థానాలు టీడీపీ ఖాతాలోకి

పార్థ సోదరుల పట్టు పదిలం!

గ్లోబల్ వార్త - వేముల

వేముల మండల రాజకీయాల్లో పేర్ల పార్థసారథి రెడ్డి కుటుంబం మరోసారి తనదైన ముద్ర వేసింది. ప్రతికూల పరిస్థితుల్లోనూ పార్టీని, కార్యకర్తలను అంటిపెట్టుకుని సాగిన పార్థసారథి రెడ్డి కుటుంబానికి తాజా ఎన్నికల ఫలితాలు మరింత బలాన్ని చేకూర్చాయి. మండలంలోని ఎనిమిదికి ఎనిమిది ఎంపీటీసీ స్థానాలను టీడీపీ కైవసం చేసుకోవడం ఆ కుటుంబ రాజకీయ ప్రాబల్యానికి నిదర్శనంగా నిలిచింది.వేముల ఎంపీటీసీ గా పేర్ల శేషా రెడ్డి, వి. కొత్తపల్లి ఎంపీటీసీ గా వేముల ఓబులేసు, చాగలేరు ఎంపీటీసీ గా తమటం నాగభూషణం రెడ్డి, నల్లచెరువు పల్లె ఎంపీటీసీ గా మేకల జ్యోతి, గొల్లల గూడూరు గూడూరు జకరయ్య, పెద్దజుటూరు ఎంపీటీసీ గా గండు సరళ, వేల్పుల ఎంపీటీసీ షేక్ ఉస్సేన్ బీ, మీదిపెంట్ల ఎంపీటీసీగా లావనూరు లోకేశ్వరి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ పేర్ల శేషా రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీతో సుదీర్ఘ అనుబంధం కలిగిన పార్థసారథి రెడ్డి కుటుంబం రాజకీయంగా ఎన్నో ఒడిదుడుకు లను ఎదుర్కొన్నప్పటికీ పార్టీ పట్ల తన నిబద్ధత ను కొనసాగించింది. ముఖ్యంగా 2019లో టీడీపీ అధికారానికి దూరమైన సమయంలోనూ కార్యకర్తలకు అండగా నిలుస్తూ, వారి కష్టసుఖాల్లో భాగస్వాములవుతూ పార్టీ శ్రేణుల్లో ధైర్యాన్ని నింపింది. అధికారం ఉన్నా లేకున్నా కార్యకర్తలతో కలిసి నడవడమే తమ రాజకీయ బలమని ఆ కుటుంబం చాటిచెప్పింది. రాజకీయాల్లో పదవులు, అధికారం తాత్కాలికమని, కార్యకర్తల అభిమానం, ప్రజలతో ఉన్న అనుబంధమే శాశ్వతమని నిరూపించేలా పార్థ సోదరుల రాజకీయ ప్రస్థానం సాగుతోందని స్థానిక టీడీపీ శ్రేణులు పేర్కొంటున్నాయి. కష్టకాలంలో కార్యకర్తలను కాపాడుకుంటూ, పార్టీ పునాదులను బలోపేతం చేసేందుకు చేసిన కృషి ఇప్పుడు సానుకూల ఫలితాలను అందించిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తాజా స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని ఎనిమిది ఎంపీటీసీ స్థానాలనూ టీడీపీ కైవసం చేసుకోవడం ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఈ విజయంతో వేముల మండలంలో టీడీపీ తన పట్టును మరింత బలోపేతం చేసుకుంది. పార్థసారథి రెడ్డి కుటుంబం పట్ల పార్టీ కార్యకర్తల్లో ఉన్న నమ్మకం, సోదరుల మధ్య సమన్వయం, పార్టీ కోసం నిరంతరం పనిచేసే తత్వం ఈ రాజకీయ విజయానికి ప్రధాన బలంగా నిలిచాయని పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అధికారం లేని సమయంలోనూ కార్యకర్తలకు అండగా నిలిచి.. ప్రతికూల పరిస్థితుల్లోనూ పార్టీ జెండాను వదలకుండా ముందుకు సాగిన పార్థసారథి రెడ్డి కుటుంబానికి ఎనిమిదికి ఎనిమిది ఎంపీటీసీ స్థానాల విజయం రాజకీయంగా ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. వేముల మండలంలో టీడీపీకి పూర్వవైభవం తీసుకురావడంలో పార్థ సోదరుల పాత్ర మరోసారి చర్చనీయాంశంగా మారింది.



జగన్ కంచుకోట పులివెందులలో కూటమి జెండా

ఏకగ్రీవంగా జడ్పీటీసీ సభ్యుల ఎన్నిక!

గ్లోబల్ వార్త - పులివెందుల

పులివెందుల నియోజకవర్గం వైఎస్ జగన్‌కు కంచుకోటగా పేరొందినప్పటికీ, పులివెందులలో మారుతున్న రాజకీయ సమీకరణాలకు ఈ ఏకగ్రీవ ఎన్నికలు నిదర్శనం అని టిడిపి శ్రేణులు పేర్కొన్నారు. సింహాద్రిపురం, తొండూరు జడ్పీటీసీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సత్తా చాటారు. కడప జిల్లా జడ్పీ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా సింహాద్రిపురం జడ్పీటీసీ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన మారెడ్డి భరత్ రెడ్డి , తొండూరు జడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికైన శివ మోహన్ రెడ్డి డిక్లరేషన్లు అందుకున్నారు.ఈ కార్యక్రమంలో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్య రెడ్డి, పుత్తా నరసింహా రెడ్డి పాల్గొన్నారు.



పట్టణాభివృద్ధికి కృషి చేయాలన్నదే నా లక్ష్యం

ఇంటిట ప్రచారంలో బీటెక్ రవి, తుగుట్ల మధుసూదన్ రెడ్డి

గ్లోబల్ వార్త - పులివెందుల

పులివెందుల పట్టణ నియోజకవర్గం ప్రజల కష్టసుఖాలలో భాగస్వామిగా ఉంటూ పులివెందుల పట్టణ అభివృద్ధికి కృషి చేయాలన్నదే నా లక్ష్యం అని పులివెందుల టిడిపి ఇన్చార్జ్ బీటెక్ రవి, తగుట్ల మధుసూదన్ రెడ్డి లు పేర్కొన్నారు. మంగళవారం పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని,8వ వార్డు జెండామాను వీధి లో తదితర ప్రాంతాలలో మున్సిపాల్ ఎన్నికల ప్రచారంలో పులివెందుల టిడిపి ఇన్చార్జ్ బీటెక్ రవి రాష్ట్ర ఉపాధ్యక్షులు పేర్ల పార్థసారథి రెడ్డి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల మధుసూదన్ రెడ్డి టిడిపి కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహిస్తూ ,ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటూ, సమస్యల పరిష్కారానికి తప్పనిసరిగా మార్గం చూపిస్తానని వార్డు ప్రజలకు హామీ కల్పిస్తూ విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ పులివెందుల పట్టణాభివృద్ధి తో పాటు ప్రజలకు అండగా ఉంటూ ప్రజాసేవే లక్ష్యంగా ముందుకళతానని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం పారిశుద్ధ్యని మెరుగుపరచడం, తాగునీరు రహదారులు వీధి దీపాలు వంటి సమస్యలు పరిష్కరించడమే నా ప్రధాన లక్ష్యాలు అని, మహిళలు యువత పేదలు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తూ పులివెందుల ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా సేవలందించాలన్నది నా ముఖ్య ఉద్దేశమని తెలియజేస్తూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో టిడిపి మున్సిపల్ చైర్ పర్సన్ గీత కుమారి కౌన్సిలర్ అభ్యర్థులను సైకిల్ గుర్తుకు మీ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వార్డు ప్రజలు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో గుడుసబ్ బాబఫేకరోద్దీన్, కరీములా షైక్ అక్రమ్ అలీ అహమద్ ఫయాజ్ చిన్న బాబా బాబు అబ్దుల్ సత్తార్, శానవాజ్ బాషా, మెకానిక్ గంగాధర్ , మునయ్య, ఉల్లెల్లా బాబు ఉల్లెల్లా సీను మహిళా కార్యకర్తలు టిడిపి నాయకులు శ్రేణులు పాల్గొన్నారు.

రాజకీయ కురుక్షేత్రంలో గెలుపోటములు సహజం

గ్లోబల్ వార్త - వేంపల్లి

నైతిక విలువల సందిగ్ధతలు సహజం. పరిస్థితులకు లొంగకుండా, ఒక నిమిత్తమాత్రుడిగా మనవంతు కర్తవ్యాన్ని నిర్వహించి, అంతర్గత మరియు బాహ్య సవాళ్లను దాటుకుంటూ ముందుకు సాగడమే అసలైన ధర్మం! ప్రత్యక్ష రాజకీయాల్లో భారతీయ జనతా పార్టీ తరపున ఒక ఫీజ పదవి పొందినందుకు మరియు ప్రజలకు మేలు చేయగలిగే అవకాశం వచ్చినందుకు సంతోషకరమైన విషయం. ఈ అవకాశం కల్పించిన బిజెపి, టిడిపి, జనసేన పార్టీల పెద్దలకు, పులివెందుల మరియు వేంపల్లి మండల కూటమి పెద్దలకు పేరు పేరున ధన్యవాదాలు.



మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి

19వ వార్డులో బీజేపీ మండలాధ్యక్షుడు నవీన్ విస్తృత ప్రచారం

గ్లోబల్ వార్త - పులివెందుల అర్బన్

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో కూటమి అభ్యర్థుల తరఫున భారతీయ జనతా పార్టీ (బీజేపీ) పులివెందుల మండల అధ్యక్షుడు వై.నవీన్ ముమ్మర ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలతో కలిసి ఆయన వార్డులోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. కూటమి తరఫున చైర్మన్ అభ్యర్థిగా బరిలో ఉన్న తూగుట్ల గీత కుమారితో పాటు కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతుగా ఈ ప్రచార కార్యక్రమం సాగింది. నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను ప్రత్యక్షంగా కలుసుకుని,కూటమి లక్ష్యాలు, అభివృద్ధి ప్రణాళికలను వివరించారు.ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు వై.నవీన్ మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి పనిచేస్తుందని వార్డులోని స్థానిక సమస్యల పరిష్కారం,మెరుగైన మౌలిక వసతుల కల్పన కూటమి అభ్యర్థుల గెలుపుతోనే సాధ్యమవుతాయి.ప్రజల సంక్షేమం, ప్రాంత పురోగతిని కాంక్షించి 19వ వార్డు ప్రజలు కూటమి చైర్మన్,కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు,స్థానిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.



లింగాల మండలంలో 9 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవం

గ్లోబల్ వార్త - లింగాల

మండల పరిధిలోని 9 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవమైనట్లు మంగళవారం మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుహాసిని తెలిపారు. ఇందు లో భాగంగా 8 ఎంపీటీసీ స్థానాలు తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు, ఒక ఎంపీటీసీ స్థానం బిజెపి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆరవ సుహాసిని తెలి పారు. లింగాల ఎంపీటీసీ ఓటనీల మహేశ్వరి, కామసముద్రం ఎంపీటీసీ దేవి రెడ్డి,సంజీవరెడ్డి, ఇప్పట్ల ఎంపీటీసీ పందిళ్ళపల్లి మనోహర్‌రెడ్డి, చిన్నకుడాలఎంపీటీసీలోమడస్నేహా, బోనాల ఎంపిటిసి కొమ్మజయరామిరెడ్డి, వెలిదండ్ల ఎంపీ టీసీ గొడ్డుమర్రి అనిల్ కుమార్, పార్నపల్లె ఎంపీటీసీముక్కోళ్లరమేష్, కోమనూతల ఎంపీటీసీ నాగిరెడ్డి ప్రసన్న తెలుగుదేశం పార్టీకి చెందినవారు, బిజెపి పార్టీకి,చెందిన బుడమ కుంట్ల సువర్ణ మురారిచింతల ఎంపీటీసీ స్థానాని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు లింగాల మండల ఎన్నికల అధికారిణి సుహాసిని తెలిపారు.



సింహాద్రిపురం జడ్పిటిసి అభ్యర్థిగా జోగి రెడ్డి భరత్ రెడ్డి నామినేషన్

గ్లోబల్ వార్త - సింహాద్రిపురం

కడప జడ్పీ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి సుబ్రహ్మణ్యంకి తెలుగుదేశం పార్టీ సింహాద్రిపురం జడ్పీటీసీ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ బి ఫామ్.ను మారెడ్డి భరత్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ అభ్యర్థిగా తన నామినేషన్ ప్రక్రియలో భాగంగా పార్టీ బి-ఫామ్‌ను అధికారులకు అందజేసి అనంతరం ఆయన మాట్లాడుతూ జడ్పిటిసి అభ్యర్థిగా అవకాశం ఇచ్చినందుకు ప్రభుత్వ నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేస్తూ సింహాద్రిపురం మండల పరిధిలో అత్యధిక మెజార్టీ విజయం సాధిస్తానని ప్రజలకు అందరికీ అండగా నిలుస్తానని ప్రజల కష్టాలలో ఆపదల్లో అందర్నీ ఆదుకుంటానని సమస్యలకు పరిష్కారం చూపిస్తానని తెలియజేశారు.

4, 6 తేదీల్లో తిరుపతిలో డిజిపిలు, ఐజిపిల సమావేశం

ప్రధాన మంత్రి నరేంద్ర మోడి, కేంద్ర హోం మంత్రి అమిత్ షా హాజరు

ప్రజాశక్తి - అమరావతి

డిశంబరు 4నుండి 6వరకు తిరుపతిలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్‌లో డిజిపిలు, ఐజిపిల సమావేశం జరగనుంది. ఈసమావేశానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడి, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తదితరులు హాజరు కానున్నారు.ఇందుకు సంబంధించి సోమవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ ఇంటర్ డిపార్టు మెంటల్ కమిటీ సమావేశం నిర్వహించి చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఎక్కడా పొర పాట్లకు ఆస్కారం లేని రీతిలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సిఎస్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో అదనపు డిజిపి మధుసూదన్ రెడ్డి,హోం శాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామల రావు, కమీషనర్ సెకండరి హెల్తు చక్రధర్ బాబు, ఎస్ఐబి డిప్యూటీ డైరెక్టర్ అంబిక,ఐపిఎస్ అధికారి కాంతి రాణా తాతా తదితర అధికారులు పాల్గొన్నారు. వర్చువల్‌గా టిఆర్‌అండ్బి కార్యదర్శి కె.శశిధర్,తిరుపతి కలెక్టర్ డా.వెంకటేశ్వర్,ఎస్పి,ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయాలపై ముందస్తు పంజా

అర్నబ్ తుపానును ఎదుర్కొనేందుకు విద్యుత్ శాఖ సన్నద్ధం

విద్యుత్ పునరుద్ధరణకు 6 వేల మంది సిబ్బంది సిద్ధం

సమస్యలపై 1912కు సమాచారం ఇవ్వండి.. మంత్రి గొట్టిపాటి రవికుమార్



గ్లోబల్ వార్త - అమరావతి : అర్నబ్ తుపాను నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా, ప్రభావిత ప్రాంతాల్లో త్వరితగతిన పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు విద్యుత్ శాఖ సన్నద్ధమైంది. తుపాను సంసిద్ధతపై విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈపీడీసీఎల్ ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. తుపాను తీవ్రత అధికంగా ఉండే జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించడంతో పాటు, ప్రభావిత ప్రాంతాల్లో సీఎండీలు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. తుపాను కారణంగా విద్యుత్ లైన్లకు నష్టం వాటిల్లినా, సరఫరా నిలిచిపోయినా వీలైనంత త్వరగా పునరుద్ధరించేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. అవసరమైన విద్యుత్ స్తంభాలు, కండక్టర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుళ్లు, ఇతర సామగ్రిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. విద్యుత్ లైన్లపై చెట్లు, కొమ్మలు పడినప్పుడు వాటిని తొలగించేందుకు అవసరమైన యంత్రాలు, పరికరాలను సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు. విద్యుత్ పునరుద్ధరణ పనుల కోసం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6 వేల మంది సిబ్బందిని సిద్ధం చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఇందులో ఈపీడీసీఎల్ నుంచి 4 వేల మంది, ఎస్పీడీసీఎల్ నుంచి వెయ్యి మంది, సీపీడీసీఎల్ నుంచి మరో వెయ్యి మందిని విధులకు కేటాయించారు. తుపాను ప్రభావంతో ఇప్పటికే పలు ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. తుపాను సమయంలో విద్యుత్ శాఖ అధికారులు రెవెన్యూ, సచివాలయ, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టడంతో పాటు, ప్రాణ, ఆస్తి నష్టాలను సాధ్యమైనంత వరకు తగ్గించేలా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు ప్రజలు వెంటనే 1912 నంబర్‌కు సమాచారం అందించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. విద్యుత్ సరఫరాకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించేందుకు 1912 కాల్ సెంటర్‌ను 24 గంటలూ అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఒకేసారి 30 వేలకుపైగా కాల్స్‌ను స్వీకరించేలా కాల్ సెంటర్‌ను సిద్ధం చేసినట్లు అధికారులు వెల్లడించారు. తుపాను సమయంలో తెగిపడిన విద్యుత్ తీగలు, కండక్టర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ చేతులతో తాకరాదని మంత్రి ప్రజలకు సూచించారు. అలాంటి పరిస్థితులు కనిపిస్తే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అధికారుల సూచనలు పాటించాలని, విద్యుత్ ప్రమాదాల నివారణకు సహకరించాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ విజ్ఞప్తి చేశారు.

కూటమి అరాచకాలపై వైఎస్ అవినాశ్ ఆగ్రహం



గ్లోబల్ వార్త - పులివెందుల : స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో కూటమి ప్రభుత్వం అరాచకాలకు పాల్పడుతోందని ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పులివెందులలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ముఖ్యనేతలు, శ్రేణులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్ అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో అధికార పార్టీ పెద్దఎత్తున అరాచకాలకు పాల్పడుతోందని, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డు కుంటున్నారని ఆయన ఆరోపించారు.అధికార దుర్వినియోగంతో ఎన్నికలు నిర్వహిస్తున్నారని, నామినేషన్ వేయాలన్నా నేడు యుద్ధం చేయాల్సిన దుస్థితి నెలకొందని మండిపడ్డారు. పార్టీ కార్యకర్తలపై దాడులు చేసి, తిరిగి వారిపైనే అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా, బెదిరింపులకు పాల్పడినా తాము భయపడేది లేదని స్పష్టం చేశారు.

బద్వేల్ బీజేపీలో బాంబు పేల్చిన సీనియర్ నేతలు



గ్లోబల్ వార్త - బద్వేల్: పోరుమామిళ్ల మండలం రంగసముద్రం పంచాయతీకి చెందిన బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి, మాజీ అసెంబ్లీ కో-కన్వీనర్ పల్లంశెట్టి పండరి, మండల కార్యదర్శి పల్లంశెట్టి అరుణ తమ పదవులకు రాజీనామా చేశారు. 25 ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడుతున్న తమకు ఎంపీటీసీ టికెట్ ఇవ్వాలని జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డిని కోరగా, రూ.30 లక్షలు డిమాండ్ చేశారని పండరి సంచలన ఆరోపణలు చేశారు. పార్టీ కోసం కష్టపడిన వారికి టికెట్లు ఇవ్వకుండా డబ్బులు ఇచ్చేవారికే టికెట్లు అమ్ముకుంటున్నారని, దీనివల్ల పార్టీకి తీవ్ర నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడిన వారికి గుర్తింపు లేకపోవడంతో పదవులకు రాజీనామా చేస్తున్నామని, సాధారణ కార్యకర్తలుగా కొనసాగుతామని పేర్కొంటూ తమ రాజీనామా లేఖను జిల్లా అధ్యక్షులు, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు, రాష్ట్ర అధ్యక్షులకు పంపినట్లు తెలిపారు.



కంకి కొడవలి గుర్తుకు ఓటు వేసి వెంకట శివను గెలిపించండి

సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

గ్లోబల్ వార్త - వైఎస్సార్ కడప జిల్లా :

నగరపాలక సంస్థ ఎన్నికల్లో 6వ డివిజన్ సీపీఐ కార్పొరేటర్ అభ్యర్థి అడ్వకేట్ ఎన్. వెంకట శివకు మద్దతుగా ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాలి చంద్ర మాట్లాడుతూ, 6వ డివిజన్ సమగ్ర అభివృద్ధి కోసం పోటీ చేస్తున్న సీపీఐ అభ్యర్థి వెంకట శివకు ప్రజలు మద్దతు తెలిపి, కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 6వ డివిజన్‌లోని ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధి అవసరాన్ని వివరించారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, డివిజన్ అభివృద్ధికి కృషి చేయడమే లక్ష్యంగా వెంకట శివ ఎన్నికల బరిలో నిలిచారని తెలిపారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్, నిరంజన్ నగర్ ప్రాంత ప్రజలు ఎన్నికల ప్రచారంలో భాగస్వాములై సీపీఐ అభ్యర్థికి తమ మద్దతు తెలియజేయాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో అభ్యర్థి వెంకట శివ తో పాటు సీపీఐ నాయకులు నాగ సుబ్బారెడ్డి, వేముల ఓబులేసు, శివ శంకర్ , బ్రహ్మం,మల్లికార్జున, భాగ్యలక్ష్మి, నారాయణ, దస్తగిరమ్మ, ప్రదీప్, మధు, నవీన్ పాల్గొన్నారు.



అవినీతి నిరోధక అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎస్పీ హర్షవర్ధన్ రాజు

గ్లోబల్ వార్త- ఒంగోలు:

సమాజంలో అవినీతిని నిర్మూలించి, ప్రభుత్వ సేవల్లో పారదర్శకతను పెంపొందించేందుకు ప్రజలు చురుకుగా భాగస్వాములు కావాలని ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు పిలుపునిచ్చారు. అవినీతిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన అవినీతి నిరోధక అవగాహన పోస్టర్‌ను మంగళవారం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వ సేవల్లో పారదర్శకత, నిజాయితీ, జవాబుదారీతనాన్ని పెంపొందించడంతో పాటు అవినీతిని అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం అడిగినా, అవినీతికి పాల్పడినా ప్రజలు మౌనంగా ఉండకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. లంచం డిమాండ్ చేసినా, అవినీతికి సంబంధించిన ఘటనలు ఎదురైనా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అలాగే 9440440057 వాట్సాప్ నంబర్‌కు కూడా సమాచారాన్ని పంపించవచ్చని పేర్కొన్నారు. అవినీతి కార్యకలాపాలకు సంబంధించి విశ్వసనీయమైన సమాచారాన్ని ఏసీబీ అధికారులకు అందించి, అవినీతి నిర్మూలనకు సహకరించాలని ప్రజలను కోరారు. ప్రజల భాగస్వామ్యంతోనే అవినీతిని సమర్థంగా అరికట్టడం సాధ్యమవుతుందని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రభుత్వ వ్యవస్థల్లో జవాబుదారీతనం పెరిగి, ప్రజలకు పారదర్శకమైన సేవలు అందాలంటే ప్రతి ఒక్కరూ అవినీతికి వ్యతిరేకంగా నిలబడాలని పిలుపునిచ్చారు. ప్రజల సహకారంతో సుపరిపాలన సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు.

కడపలో జేజేబీ, బాలల గృహం పరిశీలన

గ్లోబల్ వార్త - వైఎస్సార్ కడప జిల్లా : రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాను సారంగా గౌరవ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయధికారి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప. జి .రామ గోపాల్ వారి సూచనల మేరకు గౌరవ ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారు కడప నగరంలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహమును, ప్రభుత్వ పరిశీలన గృహమును విజిట్ చేసి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. గదులు, వంటగది, ఆహార ఏర్పాట్లు, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. బాలలకు కల్పిస్తున్న వసతులు, సంరక్షణ, భద్రతకు సంబం ధించిన అంశాలను సమీక్షించి, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, అవసరమైన సదుపాయాలు కల్పించాలని సంబంధిత సూపరింటెండెంట్‌కు సూచనలు జారీ చేశారు.అనంతరం మధ్యవర్తిత్వం, లీగల్ సర్వీసెస్ టు యూనిట్ మనోన్యాయ, లీగల్ సర్వీసెస్ టు యూనిట్ చిల్డ్రన్ (గ్రూపజ), బాలల హక్కులపై అవగా హన కల్పించారు. న్యాయ సేవల ప్రాధాన్యత, ఉచిత న్యాయ సహాయం లభ్యత, బాలల హక్కుల పరిరక్షణపై వివరించారు. మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి యం.రేష్మ కడప, డిఎల్ఎస్ఎ సిబ్బంది, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్, పానల్ న్యాయవాదులు, ప్రభుత్వ బాలుర వసతి గృహము, ప్రభుత్వ పరిశీలన గృహము సూపర్ ఇండెంట్, ఉపాధ్యాయులు, పారా లీగల్ వాలంటరీలు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆ రోజు పులివెందుల వస్తా..!



గ్లోబల్ వార్త -వైఎస్సార్ జిల్లా: "మున్సిపల్ ఎన్నికల ఓటింగ్ రోజు నేను పులివెందుల వస్తా. అయినా మీరు అక్రమాలు చేయాలనుకున్నారో?. ఎంత మంది వస్తారో రండి. గట్టిగా తగులుదాం. ప్రజాస్వామ్యంలో ఎవరు మంచి చేశారో ప్రజలు వాళ్లకు మాత్రమే తోడుగా నిలబడతారనే సంకేతం కచ్చితంగా పంపిస్తాం" అంటూ టీడీపీ గూండాలను వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హెచ్చరించారు. "మీ మీద పడ్డ దెబ్బను మీ అన్న చూస్తూ ఊరుకోడు. జగన్ 2.0లో జగన్ ఒక్కటైతే.. రెండోది కార్యకర్తే. మీరు తోడుగా నిలబడ్డారు కాబట్టే నేను సీఎం అయ్యాను. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమన్న ఆయన.. మన హక్కులు మనమే కాపాడుకోవాలి. తిరగబడండి.. మీ అన్న మీకు తోడుగా ఉంటాడు. మీ మీద పడ్డ దెబ్బను మీ అన్న చూస్తూ ఊరుకోడు. పులివెందులలో కొడితే చెంప గుయ్‌మనాలి. పులివెందులలో సౌండ్ రాష్ట్రంలో మోగాలి" అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. "మీరు డ్యూటీ చేస్తున్నది చంద్రబాబు కోసం కాదు. మీ టోపీపై మూడు సింహాలను చూసి డ్యూటీ చేయండి. రక్షకులుగా ఉండాల్సినవారే దౌర్జన్యం చేస్తే కాపాడేదెవరు?. అరెస్టులు చేసినా, కేసులు పెట్టినా భయపడేది లేదు. మా వాళ్లపై చెయ్యి వేస్తే.. నాపై వేసినట్టే..!" అని వైఎస్ జగన్ స్పష్టం చేశారు.



పోలీసుల ఫ్లాగ్ మార్చ్


గ్లోబల్ వార్త - పెనుకొండ : జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు రానున్న మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించడమే లక్ష్యంగా ఈరోజు ఉదయం పెనుకొండ పట్టణంలో పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పెనుకొండ డీఎస్పీ శివ ప్రసాద్ గారి పర్యవేక్షణలో , సిఐ శేఖర్, పెనుకొండ సబ్ డివిజన్‌కు చెందిన ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది అల్లర్ల నియంత్రణ పరికరాలు, అవసరమైన భద్రతా సామగ్రితో ఈ ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్నారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడం, పోలీసులపై నమ్మకాన్ని కల్పించడం, శాంతిభద్రతలను పరిరక్షించడం, అసాంఘిక శక్తులను నిరోధించడం ఈ ఫ్లాగ్ మార్చ్ ప్రధాన ఉద్దేశమని డీఎస్పీ గారు తెలిపారు.రానున్న మున్సిపల్ ఎన్నికలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ లు శేఖర్, రాజ్ కుమార్, శివ రాముడు ,ఎస్ఐ లు వెంకటేశ్వర్లు, సుధాకర్ యాదవ్ ,రాఘవయ్య, రవికుమార్ , రమేష్, రాజకుల్లయప్ప, వలి ,సిబ్బంది పాల్గొన్నారు.

30న నావిక్--03 ఉపగ్రహ ప్రయోగం

దేశానికి పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో నావిగేషన్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శ్రమిస్తోంది. సెకండ్ జనరేషన్ ఉపగ్రహాలను నావిక్ పేరుతో ప్రయోగిస్తోంది. ప్రజలకు, సైనిక అవసరాలకు ఎంతో ఉపయోగపడే ఈ వ్యవస్థ రూపకల్పనలో భాగంగా ఈ నెల 30వ తేదీన నావిక్--03 ఉపగ్రహాన్ని ప్రయోగిస్తోంది. భారత క్షేత్రీయ దిక్సూచి ఉపగ్రహ వ్యవస్థ (ఇండియన్ రీజనల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం--ఐఆర్ఎన్ఎస్-ఎస్)లో ఇబ్బందులు తలెత్తడంతో నావిక్ సిరీస్ ఉపగ్రహాలను రోదసీలోకి పంపుతోంది. నిరంతరా యంగా నావిగేషన్ సేవలు అందించాలంటే ఏడు ఉపగ్రహాలు ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. కనీసం నాలుగు ఉపగ్రహాలు పనిచేస్తుండాలని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ప్రస్తుతం రెండు ఉపగ్రహాలు మాత్రమే నావిగేషన్ సేవలు అందిస్తున్నాయి. ఇస్రో 2013 నుంచి 2018 వరకు ఐఆర్ఎన్ఎస్ఎస్ సిరీస్‌లో 9 ఉపగ్రహాలను ప్రయోగించింది. ఇందులో 8 ఉపగ్రహాలు మాత్రమే నిర్దిష్టమైన కక్ష్యలోకి చేరాయి. ఒక ప్రయోగంలో రాకెట్ చివరి భాగంలోని హీట్ షీల్డ్ విడిపోకపోవడంతో ఉపగ్రహం బయటకు రాక డెబ్రిస్‌గా మారిపోయింది. ఐఆర్ఎన్ఎస్ఎస్ సిరీస్ 8 ఉపగ్రహాల్లో ఐదు ఉపగ్రహాలు (ఐఆర్ఎన్ఎస్ఎస్--1ఏ, 1సీ, 1డీ, 1ఈ, 1జీ) మాత్రమే సేవలు అందిస్తున్నాయి. ఇందులో మూడు ఉపగ్రహాల్లో అటామిక్ గడియారాలు సాంకేతికంగా పనిచేయడంలేదు. ఐఆర్ఎన్ఎస్ఎస్ ఉపగ్రహాల్లో అటామిక్ గడియారాలు పనిచేస్తేనే కచ్చితమైన సమయాన్ని, నావిగేషన్‌ను అందిస్తాయి.

ఒక్కసారి ఇవి విఫలమైతే ఉపగ్రహాలు పనికిరాకుండాపోతాయి. ఫస్ట్ జనరేషన్ ఉపగ్రహాలుగా ఉన్న



ఐఆర్ఎన్ఎస్ఎస్ సిరీస్‌కు స్వస్తిచెప్పిన ఇస్రో.. అధునాతన టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చేందుకు సెకండ్ జనరేషన్ ఉపగ్రహాల సిరీస్‌ను నావిక్ పేరుతో తీసుకొచ్చింది. 2023 మే 29 నావిక్--01 ఉపగ్రహాన్ని, 2025 జనవరి 29న నావిక్--02 ఉపగ్రహాన్ని ప్రయోగించారు. నావిక్--02 ఉపగ్రహం జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ నుంచి జియో ఆర్బిట్‌లోకి చేరే క్రమంలో సాంకేతికలోపం తలెత్తింది. ఇంధనాన్ని మండించేందుకు ఆక్సిడైజర్ వాల్వ్‌లు ఓపెన్ కాక కక్ష్య దూరాన్ని పెంచలేకపోవడంతో ఇది విఫలమైంది.

సెకండ్ జనరేషన్ శాటిలైట్స్‌గా చెబుతున్న నావిక్ ఉపగ్రహాల సిరీస్‌లో ప్రయోగించిన రెండు ఉపగ్రహాల్లో ఒకటే పనిచేస్తోంది. అంటే ప్రస్తుతం ఐఆర్ఎన్ఎస్ఎస్ సిరీస్‌లోని రెండు ఉపగ్రహాలు, నావిక్ ఉపగ్రహాల్లో ఒకటి.. మొత్తం మూడు మాత్రమే సేవలు అందిస్తున్నాయి. అందుకే నావిగేషన్ వ్యవస్థను బలోపేతం చేయడానికి నావిక్--03 ఉపగ్రహాన్ని ఈ నెల 30న ప్రయోగించేందుకు ఇస్రో సిద్ధమైంది. ఈ ఉపగ్రహంతో నావిగేషన్ వ్యవస్థ కొంత బలపడే అవకాశం ఉంది. ఈ వ్యవస్థ బలపడితే భారతదేశం అంచునుంచి సుమారు 1,500 కిలోమీటర్ల పరిధి దాకా ఈ సేవలు అందుతాయి.

ప్రయోజనాలెన్నో...

ఈ ఉపగ్రహాల వ్యవస్థతో భూ, జల, వాయు మార్గాల స్థితిగతులు, దిక్కులు తెలియజేయడం, ఆముద సమయాల్లో భూగోళానికి సంబంధించిన సమాచారం, వాహన చోదకులకు దిశానిర్దేశం, ఇంటర్నెట్‌తో అనుసంధానం వంటి ఎన్నో సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. అదేవిధంగా భారత విమానయాన, నౌకాయాన మార్గాలకు, సైనిక అవసరాలకు కూడా ఈ ఉపగ్రహ వ్యవస్థ ఉపయోగపడుతుంది. రూ.3,425 కోట్లతో సొంత నావిగేషన్ దేశానికి పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో నావిగేషన్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చేందుకు ఏడు ఉపగ్రహాల అవసరాన్ని 2006లోనే ఇస్రో గుర్తించింది. దీనికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.3425 కోట్లను కేటాయించింది.

ఏడు ఉపగ్రహాలకు రూ.1,000 కోట్లు, రాకెట్లకు రూ.1,125 కోట్ల వ్యయం అంచనాతో ఈ ప్రాజెక్ట్ చేపట్టారు. ఈ ఉపగ్రహ వ్యవస్థ కోసం ప్రత్యేకంగా బెంగళూరు సమీపంలోని బైలాలు అనే ప్రాంతంలో రూ.1,300 కోట్లతో గ్రౌండ్‌స్టేషన్ నిర్మించారు. ఈ ఉపగ్రహ వ్యవస్థలోని ఏడు ఉపగ్రహాల్లో మూడు భూమికి 36 వేల కిలోమీటర్ల ఎత్తులోని భూస్థిర కక్ష్యలో 34 డిగ్రీలు, 83 డిగ్రీలు, 130.5 డిగ్రీల తూర్పు రేఖాంశాల వద్ద కక్ష్యలో ఉండి పనిచేయాల్సి ఉంది. మిగిలిన నాలుగు ఉపగ్రహాలు భూస్థిర కక్ష్యలోనే 55 డిగ్రీలు, 115 డిగ్రీల తూర్పు భూమ్యధ్య రేఖాతలానికి 31 డిగ్రీల వాలుతో కక్ష్యలో సేవలందించే విధంగా ప్రణాళికలు తయారుచేశారు.

ముంబైలో తీవ్ర వాయు కాలుష్యం.. దుమ్ము, వాహనాల పొగ, నిర్మాణ పనులే ప్రధాన కారణాలు..

గ్లోబల్ వార్త - ముంబై : దేశ ఆర్థిక రాజధాని ముంబైలో వాయు కాలుష్యం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. రోడ్లపై పేరుకుపోతున్న దుమ్ము, వాహనాల నుంచి వెలువడే పొగ, నిర్మాణ పనులు, పారిశ్రామిక కార్యకలాపాలు నగరంలో గాలి నాణ్యతను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలించని కారణంగా కాలుష్య కారకాలు గాలిలోనే పేరుకుపోతున్నాయి.

అక్టోబర్ 24న ముంబైలో గాలి నాణ్యత సూచీ (ూూ×) 322కు చేరింది. ఇది అత్యంత అధ్వాన్నమైన గాలి నాణ్యతను సూచించే స్థాయి. అదే రోజు ఢిల్లీలో ఏక్యూఐ 176గా నమోదైంది. సాధారణంగా మన దేశంలో ఢిల్లీని అత్యంత కాలుష్య నగరంగా భావిస్తారు. అలాంటిది ఢిల్లీకి దాదాపు రెట్టింపు స్థాయిలో ముంబైలో గాలి కాలుష్యం పెరిగిపోయింది. ముంబైలో వాయు కాలుష్యానికి నిర్మాణ పనులు, రోడ్లపై పేరుకుపోయిన దుమ్ము, వాహనాల రాకపోకలు, పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్య



కారకాలు ప్రధాన కారణాలు. వాహనాలు ప్రయాణించే సమయంలో రోడ్లపై ఉన్న సూక్ష్మ ధూళి కణాలు గాలిలోకి చేరుతున్నాయి. రద్దీగా ఉండే కూడళ్లు, ప్రధాన రహదారుల వద్ద వాహనాల పొగ కూడా సమస్యను మరింత పెంచుతోంది .నగరంలో భారీ నిర్మాణాలు, మౌలిక సదుపాయాల పనులు కొనసాగుతుండటంతో నిర్మాణ ప్రదేశాల నుంచి వెలువడే ధూళిని నియంత్రించడం కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) నిర్మాణ ప్రదేశాల్లో కాలుష్య నియంత్రణ కోసం 28 అంశాలతో కూడిన మార్గదర్శకాలను జారీ చేసింది. నగరంలోని వివిధ వార్డుల్లో 76 ప్రత్యేక బృందాలను కూడా నియమించింది. ప్రతి బృందం రోజుకు కనీసం రెండు నిర్మాణ ప్రదేశాలను తనిఖీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ముంబై నగరంలో సముద్ర తీరంలో ఉండటంతో సాధారణంగా గాలుల ద్వారా కాలుష్య కారకాలు చెదిరిపోయే అవకాశం ఉంటుంది. అయితే గాలి వేగం తగ్గినప్పుడు, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు కాలుష్య కారకాలు ఒకేచోట పేరుకుపోతాయి. గాలిలోని తేమ, సముద్రపు ఉప్పు కణాలు కూడా పొగమంచు వంటి పొర ఏర్పడటానికి కొంతవరకు దోహదపడవచ్చు.



న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్‌లో దీపావళి వెలుగులు

న్యూయార్క్ నగరంలోని ప్రసిద్ధ 'టైమ్స్ స్క్వేర్'లో దీపావళి వేడుకలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. అమెరికాలోని భారతీయ, దక్షిణ ఆసియా సమాజం (ణఱుంజూశీతీఱు) వేలాదిగా తరలివచ్చి, భారతీయ సంస్కృతి, కళలు, వంటకాలతో ఈ దీపకాంతుల పండుగను ఘనంగా జరుపు కున్నారు. రోజంతా సాగిన ఈ ఉత్సవాల్లో 'దీపావళి బజార్', సాంప్రదాయ దివ్య దీపాల కాంతుల వెలుగులు, వన్ టైమ్స్ స్క్వేర్ బాల్ డ్రాప్ టవర్‌పై వర్చువల్ దీపావళి కౌంట్‌డౌన్, 'లైట్ అప్ టైమ్స్ స్క్వేర్ కాన్సర్ట్' ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. అమెరికన్ ర్యాపర్ రాజా కుమారి, ప్రముఖ గాయని కనికా కపూర్ మొదలైన కళాకారులు తమ సంగీత ప్రదర్శనలతో మైమరిపించారు. న్యూయార్క్‌లోని భారత కాన్సుల్ జనరల్ బినయ్ ప్రధాన్ తో పాటు న్యూయార్క్ గవర్నర్ తరపున ఆసియన్ అమెరికన్ వ్యవహారాల డైరెక్టర్ షిబు నాయర్ ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమ నిర్వాహకురాలు, న్యూయార్క్ స్టేట్ కమిషన్ సభ్యురాలు నీతా భాసిన్ మాట్లాడుతూ.. 'టైమ్స్ స్క్వేర్ వంటి ప్రపంచంలోనే అతిపెద్ద వేదికపై నుంచి శాంతి, సామరస్యం ఐక్యత అనే దీపావళి నిజమైన సందే శాన్ని చాటిచెబుతున్నాం' అని పేర్కొన్నారు. 2013లో ప్రారంభమైన ఈ 'దివాలీ ఎట్ టైమ్స్ స్క్వేర్' వేడుకలు, ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే ప్రజలకు భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలను, భిన్నత్వంలో ఏకత్వాన్ని పరిచయం చేస్తున్నా యని నిర్వహకులు తెలిపారు.

'ది పీర్, ఏ తాజ్ హోటల్' లో నోరూరించే భారతీయ వంటకాలు

దీపావళి సందర్భంగా న్యూయార్క్‌లోని ప్రసిద్ధ 'ది పీర్, ఏ తాజ్ హోటల్' ఓ ప్రత్యేక విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. న్యూయార్క్‌లోని ప్రముఖ రెస్టా రెంట్లు అయిన 'ఛట్టి', 'జునూన్', 'ముసాఫిర్'లతో కలిసి 'కలినరీ జర్నీ త్రూ ఇండియా' పేరుతో భారతదేశంలోని వివిధ ప్రాంతీయ రుచులను విదేశీయులకు, భారతీయ-అమెరికన్లకు రుచి చూపించారు.



24 ఏళ్లకే మున్సిపల్ చైర్‌పర్సన్

రాజకీయాల్లోకి వచ్చి 10 రోజులే.. ఏకగ్రీవంగా ఎన్నిక!

గ్లోబల్ వార్త - అన్నమయ్య జిల్లా

రాజంపేట మున్సిపాలిటీలో అరుదైన రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. రాజంపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌గా 24 ఏళ్ల యువ వైద్యురాలు దొంతం గాయత్రి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలుగుదేశం పార్టీ (టీడీపీ)కి చెందిన గాయత్రి ఈ పదవిని చేపట్టిన అతి పిన్న వయస్కుల్లో ఒకరిగా రికార్డు సృష్టించారు.

వైద్యం నుంచి రాజకీయాల్లోకి..

ఈ ఏడాదే బీడీఎస్ వైద్య విద్యను పూర్తి చేసిన గాయత్రి, రాజకీయాల్లోకి అడుగుపెట్టింది మొన్నటే. రాజకీయాల్లోకి వచ్చిన కేవలం పది రోజుల్లోనే నేరుగా మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠాన్ని అధిరోహించడం ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఆమె తండ్రి దొంతం శివప్రసాద్ రాజం పేట పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. వైద్యురాలిగా ప్రజా సేవ చేయాలనుకున్న గాయత్రి, ఇప్పుడు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ప్రజాసేవలోకి అడుగుపెట్టారు. ఆమె ఎన్నిక పట్ల స్థానిక ప్రజలు, టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

షర్మిల కుమార్తె వివాహ వేదిక వివాదం

స్పందించిన మంత్రి లోకేశ్



గ్లోబల్ వార్త - అమరావతి

వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ రెడ్డికి ఆయన సోదరి ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి మధ్య కోల్డ్ వార్ నడుస్తోంది. తాజాగా షర్మిల కుమార్తె అంజలి వివాహ వేదిక విషయంలో అన్నాచెల్లెలి మధ్య చోటు చేసుకున్న వివాదంతో.. వారి మధ్య దూరాన్ని మరింత పెంచింది. తాజాగా వైఎస్ షర్మిల కుమార్తె వివాహ వేదిక వివాదంపై ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పందించారు.

మంగళవారం ఆయన తన ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'ప్రతి కుటుంబంలో జరిగే వివాహంలో తన మేనకోడలిని ఆశీర్వదించి, ఆ వేడుకను గుర్తుండిపోయేలా చేయడానికి మామ ఒకరు ఉంటారు. ఇక్కడ వైఎస్ఆర్ గారి సొంత ఇంట్లో వివాహం జరగనివ్వకుండా అడ్డుకుంటున్నారు. ఆయన తన సొంత చెల్లెలితో, మేనకోడలుతో ఇలా ప్రవర్తిస్తే.. గత ఐదేళ్లుగా మన అక్కాచెల్లెళ్లతో ఆయన ఎలా ప్రవర్తించారో ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఇప్పటికే తెలుసు'నని పేర్కొన్నారు.

ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల రెడ్డి తన కుమార్తె అంజలి రెడ్డిని యూఎస్‌లో స్థిరపడిన ఏపీలోని కర్నూలు జిల్లాకు చెందిన డాక్టర్ ఎస్ రఘురామ్ రెడ్డితో వివాహం జరపాలని నిశ్చయించారు. సెప్టెంబర్ చివరి వారంలో కుమార్తె నిశ్చితార్థం జరిగింది. నవం బర్ 25వ తేదీన బెంగళూరులోని యలహంక ప్యాలెస్ వేదికగా ఈ వివాహం జరపాలని వైఎస్ షర్మిల కుటుంబం నిశ్చయిం చింది. అయితే సదరు ప్యాలెస్‌లో మేనకోడలు వివాహం చేయవద్దని షర్మిలకు వైఎస్ జగన్ స్పష్టం చేశారు. భద్రతా కార ణాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. కావా లంటే.. హైదరాబాద్ లోటస్ పాండ్‌లోని నివాసంలో అంజలీ రెడ్డి వివాహం చేయవచ్చని వైఎస్ షర్మిలకు లేఖ ద్వారా వైఎస్ జగన్ సూచించారు.

మరో వైపు పలు రాష్ట్రాల్లోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు శుభలేఖలను అందజేసి ఈ వివాహానికి వైఎస్ షర్మిల ఫ్యామిలీ స్వయంగా ఆహ్వానిస్తుంది. మేనకోడలు వివాహం జరగనున్న వేళ వైఎస్ జగన్ ఈ విధంగా వ్యవహరించడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఏపీ హై కోర్టులో

జస్టిస్ అవినాష్ సోమకాంత్ బాటే సంతాప సభ

గ్లోబల్ వార్త - అమరావతి



జస్టిస్ అవినాష్ సోమకాంత్ బాటే న్యాయ సేవలు శ్లాఘనీయమని, ఆయన సూక్ష్మ పరిశీలనతో కేసులు పరిశీలించిన విధానం యువ న్యాయవాదులకు ఆదర్శనీయమని ఏపీ హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ అన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా పని చేసిన దివంగత జస్టిస్ అవినాష్ సోమకాంత్ బాటే సంతాప సభ సోమవారం మొదటి కోర్టు హాల్ లో నిర్వహించారు.ముందుగా జస్టిస్ అవినాష్ సోమకాంత్ బాటే మృతికి సంతాప సూచకంగా ఫుల్ కోర్టు నిమిషం మౌనం పాటించి ఘన నివాళులర్పించింది. జస్టిస్ బాటే కుటుంబ సభ్యులకు కోర్టు హాల్ లో నిర్వహించే సంతాప సభ కార్యక్రమాన్ని వర్చువల్‌గా పాల్గొనేలా అవకాశం కల్పిం చడం జరిగింది. ఈ సందర్భంగా ఏపీ హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి లీసా గిల్ మాట్లాడుతూ జస్టిస్ అవినాష్ సోమ కాంత్ బాటే 25 నవంబర్ 1937 సంవత్సరంలో మహారాష్ట్రలో జన్మించారని తెలిపారు. ఆయన మహారాష్ట్రలో న్యాయవాదిగా మరియు జ్యుడీషియల్ సర్వీసెస్‌లో కెరీర్‌ను ప్రారంభించారని తెలిపారు.ఆయన చట్టపరమైన పరిజ్ఞానాన్ని గుర్తించి 1994 అక్టోబరు 6న బొంబాయి హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమించడం జరిగిందన్నారు.అదే ఏడాది బదిలీపై 1994 నవంబరు 5న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు వచ్చారని, 1996 జూన్ 3న శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించడం జరిగిందన్నారు. ఉమ్మడి ఏపీ హైకోర్టులో తన పదవీ కాలంలో డివిజన్ బెంచ్, సింగిల్ జడ్జిగా వేలాది కేసులను పరిష్కరించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు.1999 నవంబరు 25న ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేయడం జరిగిందన్నారు. రిటైర్మెంట్ తర్వాత జస్టిస్ అవినాష్ సోమకాంత్ బాటే 'మహారాష్ట్ర అడ్మిని స్ట్రేటివ్ ట్రిబ్యునల్' ఔరంగా బాద్ బెంచ్ వైస్ చైర్మన్‌గా రెండేళ్ల పాటు సేవలు అందించారని తెలిపారు. జస్టిస్ అవినాష్ సోమ కాంత్ బాటే కేసు రికార్డులను అత్యంత క్షుణ్ణంగా పరిశీలించడంలో, నిష్పాక్షికతతో వ్యవహరించడంలో, న్యాయం పట్ల అచంచలమైన నిబద్ధతను ప్రద ర్శించడంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, ఏపీ అడ్వకేట్ అసోసి యేషన్ ప్రసిడెంట్ ప్రభునాథ్ వాసిరెడ్డి జస్టిస్ అవినాష్ సోమ కాంత్ బాటే న్యాయ ప్రస్తానాన్ని స్మరించుకుంటూ ఆయన చూపిన బాట అందరికీ ఆదర్శనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఫుల్ బెంచ్ న్యాయమూర్తులు,పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. లక్ష్మీనారాయణ,ఏపీ బార్ కౌన్సిల్ ఛైర్మన్ బాలాజీ,బార్ కౌన్సిల్ ప్రతి నిధులు,ప్రభుత్వ సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్



ముందుగా ఆలయానికి చేరుకున్న ఉపరాష్ట్రపతికి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, టీటీడీ ఈవో ముద్దాడ రవి చంద్ర, జేఈవో డాక్టర్ శరత్ తో కలిసి సాదర స్వాగతం పలికిన ఎమ్మెల్యే పులివర్తి నాని. అమ్మవారి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో ఉపరాష్ట్రపతి, మంత్రి సహచర ప్రజా ప్రతి నిధులు, అధికారులతో కలిసి సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే. దర్శనా నంతరం ఆశీర్వాద మండపంలో టీటీడీ ఈవో, జేఈవో, ఎమ్మెల్యేఅమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలను గౌరవ ఉప రాష్ట్రపతికి అంద జేశారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు, అధికారులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పునరావాస కేంద్రాలను సిద్ధం చేయండి

హోం మంత్రి అనిత ఆదేశం

రాష్ట్రంలో ఏ క్షణమైనా తీరప్రాంత ప్రజల తరలింపునకు పునరావాస కేంద్రాలు సిద్ధంగా ఉండాలని అధికారులను హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. ఈ కేంద్రాల్లో స్వచ్ఛమైన తాగునీరు, ఆహారం, వైద్య సదుపాయాలు అందించాలని స్పష్టం చేశారు. అత్యవసర సహాయం కోసం విపత్తుల నిర్వహణ సంస్థ టోల్ ఫ్రీ నంబర్లు 1070, 112లను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. మంగళవారం రాజధాని అమరావతిలో ఆర్నబ్ తుపానుపై వివిధ శాఖల అధికారులతో మంత్రి అనిత సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అతి తీవ్ర తుపాను 'ఆర్నబ్'ను ఎదుర్కొనేందుకు రాష్ట్ర యంత్రాంగం పూర్తిగా సన్నద్ధంగా ఉందని అన్నారు. విపత్తు నిర్వహణ సంబంధిత శాఖల మంత్రులతో సమన్వయం చేసుకుంటూ నిరంతర పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగం మీతో ఉందని ఎటువంటి ఆందోళన పడవద్దని ఈ సందర్భంగా ప్రజలకు స్పష్టం చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు, ప్రాణ నష్టం జరగకుండా చూడటమే ఈ ప్రభుత్వ ప్రాధాన్యత అని చెప్పారు. ప్రజలకు ఎన్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, పోలీసులు, అగ్నిమాపక, రెవెన్యూ శాఖ తదితర బృందాలు 24 గంటలు అందుబాటులో ఉంటాయని ప్రజలకు మంత్రి వంగలపూడి అనిత వివరించారు.



స్థానిక ఎన్నికలకు ఐక్యంగా వెళ్తున్నాం

బీజేపీ ఏపీ చీఫ్ మాధవ్

గ్లోబల్ వార్త - అమరావతి

'చెప్పాం.. చేస్తున్నాం' అనే నినాదంతో మంచి వాతావరణంలో స్థానిక ఎన్నికలకు వెళ్తున్నామని బీజేపీ రాష్ట్రఅధ్యక్షుడు మాధవ్ అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కింది స్థాయిలోనూ సమన్వయంతో సీట్లు సర్దుబాటు చేసు కుని ఎన్నికల బరిలో నిలిచామని చెప్పారు. సుదీర్ఘ కసరత్తు తర్వాత ఏకతాటి పైకి వచ్చామన్నారు. కూటమికి బీటలు వాలుతుందేమో అని ప్రత్యర్థుల ఆశలకు అవకాశం ఇవ్వలేదని అన్నారు. కూటమి ఐక్యతతోనే సూపర్ ఎల్‌నినోతో పాటు ఎన్నో సవాళు అధిగమించి సుపరిపాలన అందిస్తున్నామని చెప్పుకొచ్చారు. అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి జరగాలనే లక్ష్యంతో స్థానిక ఎన్నికలకు వెళ్తున్నామని మాధవ్ అన్నారు. ఇందుకు అందరి ఆశీస్సులు కావాలని కోరారు. స్థానిక ఎన్నికలు ఎంతో కీలక మైన వన్నారు. కూటమి మధ్య సీట్ల సర్దుబాటు విషయంలో ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ఎంతో కృషి చేశారన్నారు. మూడు పార్టీల మధ్య సమన్వయం చాలా గొప్పదని చెప్పుకొచ్చారు. అందరం ఒక్కతాటిపైకి వచ్చి నిర్ణయాలు తీసుకున్నామని.. సార్వత్రిక ఎన్నికలలాగే ఐక్యంగా ముందుకెళ్తామని పీవీఎన్ మాధవ్ వెల్లడించారు.

తిరుపతి జిల్లాలో జనసేన బీఫారాల చించివేత.. పోలీసులకు ఫిర్యాదు

గ్లోబల్‌వార్త-తిరుపతి జిల్లా : తిరుపతి జిల్లాలోని రైల్వేకోడూరులో జనసేన బీఫారాలను ఆగంతకులు చించివేశారు. వెంకటరమణ, రెడ్డెమ్మ అనే ఇద్దరి ఎంపిటిసి అభ్యర్థుల బీఫారాలను లాక్కొని గుర్తు తెలియని వ్యక్తులు చించివేసినట్లు సమాచారం. ఈ ఘటనపై అధిష్ఠానానికి, పోలీసులకు స్థానిక జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



వైభవ్ కాదు.. జట్టుకు ఇప్పుడు వరుణ్ చక్రవర్తి అవసరం : భారత మాజీ క్రికెటర్

న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో టీమిండియా 2-0తో ఆధిక్యంలో ఉంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధించిన భారత జట్టు.. మంగళవారం వెల్లింగ్టన్ వేదికగా జరిగే మూడో టీ20లోనూ గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకోవాలని పట్టుదలగా ఉంది. అయితే గాయంతో ఇషాన్ కిషన్ దూరం కావడంతో యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీకి మరో అవకాశం ఇవ్వాలంటూ డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ క్రికెటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ చేసిన సూచన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

'వైభవ్ సూర్యవంశీని నంబర్ 3లో ఆడించే బదులు వరుణ్ చక్రవర్తిని తుది జట్టులోకి తీసుకోవాలి. ఆఖరి వికెట్ వరకు బ్యాటర్లు బాగా ఆడుతున్నారు. అలాంటప్పుడు వరుణ్ వంటి బౌలర్‌కు అవకాశం ఎందుకు ఇవ్వకూడదు? వరుణ్ ఆడితే.. న్యూజిలాండ్ భారీ స్కోర్లు చేయకుండా నియంత్రించగలడు. వైభవ్ కోసం సీనియర్ బ్యాటర్ సంజు శాంసన్ తన ఓపెనింగ్ స్థానాన్ని వదులుకోవాల్సి రావడం అన్యాయం. వైభవ్ ఓపెనర్‌గా బాగా ఆడుతున్న మాట నిజమే. కానీ సంజు కూడా ఓపెనర్‌గా రాణిస్తున్నాడు. రాజస్థాన్ రాయల్స్ తరఫున సంజు నంబర్ 3లో బాగా ఆడినప్పటికీ.. ఇప్పుడు అతడిని తన స్థానంలోనే కొనసాగించాలి. ఆటగాడి కంటే బ్యాటింగ్ స్థానం ముఖ్యం. సంజు స్థానాన్ని మార్చడానికి నేను ఎంతమాత్రం అంగీకరించను' అని బద్రీనాథ్ వివరించాడు.

బౌలర్లకు సవాలు..

మరోవైపు మూడో టీ20కి ముందు టీమిండియాకు న్యూజిలాండ్ నుంచి మాత్రమే కాకుండా వాతావరణం నుంచి కూడా సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది. మూడు వైపులా బహిరంగంగా ఉండే వెల్లింగ్టన్‌లోని బేసిన్ రిజర్వ్ మైదానంలో బలమైన గాలులు వీచే పరిస్థితులు ఉంటాయి. ఇవి బౌలింగ్, ఫీల్డింగ్ వ్యూహాలపై ప్రభావం చూపవచ్చు. తుది జట్టులో ఎలాంటి మార్పులు ఉంటాయనే విషయంపై భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ స్పష్టత ఇవ్వలేదు.

తిలక్ వర్మలో యువరాజ్, ధోని లక్షణాలు కనిపిస్తున్నాయి : సురేశ్ రైనా



న్యూజిలాండ్‌తో రెండో టీ20లో టీమిండియా అద్భుత విజయాన్ని అందుకోవడంలో కీలక పాత్ర పోషించిన యువ బ్యాటర్ తిలక్ వర్మపై భారత మాజీ క్రికెటర్ సురేశ్ రైనా ప్రశంసలు కురిపించాడు. తిలక్ ఆటతీరులో దిగ్గజ క్రికెటర్లు యువరాజ్ సింగ్, ఎంఎస్ ధోని లక్షణాలు కనిపిస్తున్నాయని పేర్కొన్నాడు. అదే సమయంలో నితీశ్ కుమార్ రెడ్డి దూకుడైన బ్యాటింగ్‌ను, చాలా కాలం తర్వాత తిరిగి జట్టులోకి వచ్చిన భువనేశ్వర్ కుమార్‌ను కూడా రైనా అభినందించాడు. ప్రస్తుతం భారత జట్టు చాలా బాగా ఆడుతోంది. తిలక్ వర్మనే తీసుకోండి. గతంలో యువరాజ్ సింగ్, ధోని భాయ్, నేను.. ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది స్థానాల్లో బ్యాటింగ్ చేసేటప్పుడు మాలో ఒక ప్రత్యేకమైన ఉత్సాహం ఉండేది. అదే లక్షణం తిలక్‌లోనూ కనిపిస్తోంది. అతడి ఆలోచనా విధానం భిన్నంగా ఉంటుంది. అద్భుతంగా రాణిస్తున్నాడు. బౌలింగ్‌లోనూ జట్టుకు సహకరిస్తున్నాడు. మరోవైపు నితీశ్ కుమార్ రెడ్డి కూడా బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణిస్తున్నాడు. ఒత్తిడిలోనూ దూకుడుగా ఆడుతూ జట్టు విజయానికి సహకరించడం మంచి పరిణామం. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బ్యాటింగ్‌లో చాలా మార్పు వచ్చింది. అయితే అతడు కెప్టెన్సీ చేస్తున్న విధానం ప్రత్యేకంగా అనిపిస్తోంది. ఈ ఫార్మాట్‌లో ఇలాంటి నాయకత్వ శైలిని చాలా సంవత్సరాల తర్వాత చూస్తున్నాను. అతడు తనకంటూ ఒక ప్రత్యేక వార సత్వాన్ని నిర్మించుకుంటున్నాడు. అతడికి నా శుభాకాంక్షలు' అని రైనా వెల్లడించాడు.



టీమిండియా మాజీ కెప్టెన్, చెన్నై సూపర్ కింగ్స్ (జూఖ) దిగ్గజం మహేంద్ర సింగ్ ధోని నాయకత్వంపై దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. మైదానంలో ధోని తీసుకునే నిర్ణయాలు, ఆటను అర్థం చేసుకునే విధానం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపాడు. ధోనికి ఉన్న ప్రత్యేక లక్షణాన్ని తన కెప్టెన్సీలోనూ అనుసరిం చాలని అనుకుంటున్నట్లు వెల్లడించాడు. ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ధోని నాయకత్వంలో ఆడిన అనుభవా ను ఫాఫ్ తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పంచుకున్నాడు.

'ధోనికి మైదానంలో ఆటను అర్థం చేసుకునే అద్భుతమైన సామర్థ్యం ఉంది. అతడు మ్యాచ్‌కు ముందే మరీ ఎక్కువగా ప్రణాళికలు వేసుకోవ డానికి ఇష్టపడడు. ఆట జరుగుతున్న సమయం లో తన సహజమైన ఆలోచనలతో నిర్ణయాలు తీసు కుం టాడు. అదే అతడి సూపర్‌పవర్. మైదానంలో పరిస్థితులను, ఆటగాళ్లను నిశి తంగా గమనిస్తూ చాలా ప్రశాంతంగా ఉంటాడు. ధోని ఎంత సంయమనంతో వ్యవహరిస్తాడో అంద రికీ తెలిసిందే. ఆ లక్షణాన్ని నేను కూడా అతడి నుంచి నేర్చు కుని నా కెప్టెన్సీలో అనుసరించాలనుకుంటున్నా' అని ఫాఫ్ వెల్లడించాడు. ఫాఫ్ డుప్లెసిస్ ఐపీఎల్‌లో మొత్తం 154 మ్యాచ్ లు ఆడి 4,773 పరుగులు చేశాడు. చెన్నై సూపర్ కింగ్స్‌తో తొమ్మిది సీజన్ల పాటు కొనసాగిన అతడు.. ధోని నాయకత్వంలో మూడు ఐపీఎల్ టైటిళ్లు గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. 2022లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టులోకి మారాడు.



టైటిల్‌పై సింధు గురి

బరిలో లక్ష్యసేన్, మాళవిక, ఉన్నతి

సార్‌బ్రూకెన్ (జర్మనీ): ఫ్రెంచ్ ఓపెన్‌లో ఫైనల్‌కు చేరిన ఏస్ షట్లర్ పీవీ సింధు అదే జోరును కొనసాగించాలనుకొంటోంది. మంగళవారం నుంచి జరిగే హైలో ఓపెన్‌లో టైటిలే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. జూలైలో జపాన్ ఓపెన్ గెలిచిన సింధు.. ఆ తర్వాత పారి?సలో తుది పోరుకు చేరుకొంది. కానీ, వరల్డ్ నెం:1 అన్ సే యంగ్ చేతిలో ఓడి రన్నర్‌పగా సరిపెట్టుకొంది. తొలి రౌండ్‌లో నెస్లిహన్ అరిన్ (టర్కీ) తో రెండో సీడ్ సింధు తలపడనుంది. ఆరో సీడ్ ఉన్నతి హుడాతోపాటు వర్ధ మాన షట్లర్లు ఆకర్షి కశ్యప్, మాళవిక బన్సోడ్, దేవిక సిహాగ్, ఇషారాణి బారువా, అన్‌మోల్ ఖర్బ్ కూడా బరిలో నిలవనున్నారు. పురుషుల సింగిల్స్‌లో మాజీ చాంపియన్ లక్ష్య సేన్‌కు ఏడు, ఆయుష్ శెట్టికి ఎనిమిదో సీడ్ దక్కాయి. తొలి రౌండ్‌లో జోకిమ్ ఓల్డోర్ఫ్ (ఫిన్‌లాండ్)తో సేన్, సులియంగ్ (తైవాన్)తో ఆయుష్ తలపడనున్నారు. తరుణ్ మన్నేపల్లి, కిరణ్ జార్జ్, హెచ్ఎస్. ప్రణయ్ కూడా ఆడనున్నారు.

భారత్ 'ఎ' తరఫున బుమ్రా, పంత్



న్యూఢిల్లీ: భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాతో పాటు వికెట్ కీపర్ రిషభ్ పంత్ న్యూజిలాండ్ 'ఎ' జట్టుతో జరిగే మూడో అనధికార టెస్టులో ఆడే అవకాశం ఉంది. వచ్చే నెల 7 నుంచి లింకన్‌లో ఈ మ్యాచ్ జరుగు తుంది. ప్రస్తుతం వీరిద్దరు బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీఓఈ) శిబిరంలో ఉన్నారు. ఆసియాగేమ్స్‌లో ఆడి న బుమ్రాకు విశ్రాంతినివ్వగా.. పంత్ గత నెలలో జరిగిన ఇరానీ కప్‌లో గాయ పడ్డాడు. ఈ ఇద్దరూ కివ?సతో జరిగే టెస్టు సిర?సలో జట్టు సభ్యులు కావడంతో ప్రాక్టీస్ కోసం భారత్ 'ఎ' తరఫున ఆడనున్నారు.

PRINTED, PUBLISHED AND OWNED DONDLAVAGU BHAVYA, PRINTED AT LAKSHMI OFFSET PRINTERS, CHUTTUGUNTA, VIJAYAWADA AND PUBLISHED FROM VIJAYAWADA
D.NO. 28-2-22, II FLOOR, SHAIK MOHIDDEEN STREET, ARUNDELPET, VIJAYAWADA-520002. EDITOR DONDLAVAGU BHAVYA. PH . 08562-461571 APTEL/2025/16480